క్లుప్తంగా

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



కల్వకుర్తి: అన్నివర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎంబీసీ చైర్మన్ జైపాల్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన ప్రారంభించిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటుచేసి, చైర్మన్‌ను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు, ఇందిరా శోభన్, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండల వెంకటస్వామి, సత్యనారాయణరాజు, వెంకటస్వామి, శ్రీరాములు, చిన్నవెంకటస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

తాడూరు: తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వాటర్ గ్రిడ్ ఏఈ వినోద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వాటర్‌ట్యాంక్ దగ్గర పైపులైన్ పనులు చేపట్టారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు నీటిని పంపించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ కార్యదర్శి పవన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఈ స్పందిస్తూ పైపులైన్‌ను సరి చేయించి సమస్య పరిష్కరించారు. గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి వెల్ఫేర్ ఫౌండేషన్ చేయూత

తెలకపల్లి: పెద్దూరు గ్రామానికి చెందిన అడ్డురాళ్ల ఆశీర్వాదం కుమారుడు ప్రకాష్ ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కుమారుడిని చదివించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో మంగళవారం విద్యార్థి తండ్రి నాగర్‌కర్నూల్‌లో హ్యుమన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆశ్రయించాడు. ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి శివశంకర్ స్పందించి రూ.10 వేలు అందజేశారు.

చలివేంద్రం ఏర్పాటు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని మరికల్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎంపీఓ బ్రహ్మచారి, పశుసంవర్ధక శాఖ మండల అధికారి డా. శివరాజ్ ప్రారంభించారు. వేసవిలో గ్రామీణుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతషకరమని వారు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కల్వకుర్తిరూరల్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ వెంకట్‌రాములు అన్నారు. మంగళవారం మండలంలోని తోటపల్లి, ఎల్లికట్ట గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మురుగు కాలువలను పరిశీలించారు. నీటి ట్యాంక్‌ల వద్ద క్లోరినేషన్ చేయించారు. అనంతరం తోటపల్లి గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు.

కవయిత్రి జ్యోతికి అంబేడ్కర్ నంది అవార్డు

పెద్దకొత్తపల్లి: బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఈ నెల 14వ తేదీన మండలంలోని జొన్నలబొగుడ గ్రామానికి చెందిన కవి, రచయిత జోగుజ్యోతికి అంబేడ్కర్ నంది అవార్డు దక్కింది. స్నేహకల్చరల్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బ్రహ్మయ్య, బొమ్మరబోగిన కేశవులు అవార్డును అందజేశారు. తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ పురస్కారంలో భాగంగా సత్కరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం జొన్నలబొగుడ గ్రామస్తులు ఆమె నివాసంలో అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వంగూరు: మండలంలో బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున ఆపార్టీ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వనపర్తి జిల్లాలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బాలస్వామి, డైరెక్టర్ రాజారంగారావు, మాజీ సర్పంచులు భాస్కర్‌రెడ్డి, సూర్యానాయక్ ఉన్నారు.

సీసీ కెమెరాలు అందజేత

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమాదేవి మంగళవారం రూ.32 వేలు విలువ చేసే సీసీ కెమెరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాలకు భద్రత కల్పించడానికి స్వంత ఖర్చులతో సీసీ కెమెరాలను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వెల్దండ: మండల కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఈ నెల 18న వెంకటరమణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫిజియోథెరపీ డాక్టర్ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం

● ఆలయాలలో శ్రీరామ నవమికి ఏర్పాట్లు



కల్యాణానికి ముస్తాబైన లింగాల రామాలయం



పాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

సాక్షి, నెట్‌వర్క్: శ్రీరామ నవమి పురస్కరించుకొని ఆలయాలను ముస్తాబు చేశారు. వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. సీతారాముల కల్యాణం చూతము రారండి.. అంటూ రాములోరి పెళ్లి చూసేందుకు జిల్లా సిద్ధమైంది. ఊరురా రామాలయాలు, ఆంజనేయస్వామి, ఇతర ఆలయాలు పెళ్లి వేదికలు కానుండగా వీధులన్నీ ఏర్పాట్లతో సందడిగా మారాయి. విద్యుత్ దీపాలతో, పూలతో, కొబ్బరి ఆకులతో కల్యాణ మండపాలు ఏర్పాటు చేశారు. భక్తులు హాజరై కల్యాణం వీక్షించేలా చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలన్నీ సరికొత్తశోభ సంతరించుకున్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు కల్యాణ క్రతువు ప్రారంభం కానుంది.12 గంటలకు అభిజిత్ లగ్నంలో రాములోరి పెళ్లి వేడుక జరగనుంది. భక్తులకు అన్నదాన చేసేందుకు పనుల్లో నిమగ్నం అయ్యారు.

ప్రముఖ ఆలయాలలో..

అచ్చంపేట భ్రమరాంబ ఆలయం, ఆంజనేయ అయ్యప్ప ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి, ఆంజనేయస్వామి, ఉప్పనుంతల మండలం కంసానిపల్లి సమీపంలోని శ్రీరామగట్టు ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో కల్యాణ వేదికలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణానికి దేవాలయాలు కాంతులీనుతున్నాయి.

కనుల పండువగా ఎదుర్కోలు ఉత్సవం

పట్టణంలోని ఉట్ల కోనేరు వద్ద నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం కనుల పండువగా కొనసాగింది. ఈ సందర్భంగా వేదపడింతులు రెండు వర్గాలుగా శ్రీరాముడు, సీతమ్మ వైపున కూర్చొని ఇరువంశాల గొప్పతనం, వారి ఔన్నత్యాన్ని తెలియజేస్తూ జరిపిన సంభాషణ అందిరినీ అలరించాయి. అంతకు ముందు చిన్నారుల కోలాటం, నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

● నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారి కల్యాణోత్సవం ఉదయం 11:45 గంటలకు అభిజిత్ లగ్న సమయంలో సామూహికంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డాక్టర్ సరిత దంపతులు, హైకోర్టు జస్టిస్ తంగిరాల మాధవిలత, తంగిరాల హనుమంత్ రెడ్డి, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొననున్నారు.

● వివిధ సామాజిక సేవారంగంలో పలు సేవలు చేస్తున్న వారికి శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం అచ్చంపేటలో అంజనీమాత సేవాసమితి ఆధ్వర్యంలో సీతారామ పురస్కారాలు అందజేయనున్నట్లు అంజనీమాత సేవా సమితి అధ్యక్షురాలు సునీతాబాయి తెలిపారు.



నాగర్‌కర్నూల్‌లో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

ఉప్పునుంతల: కేదారేశ్వరాలయం, కాంసానిపల్లి శ్రీరామ గట్టు, అయ్యవారిపల్లి పాతూరు భక్తాంజనేయ స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. కేదారేశ్వరాలయంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా కొత్తగా రథోత్సవం నిర్వహించనున్నారు.

● లింగాల మండల కేంద్రంలోని కోదండరామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రధాన అర్చకులు రామాచారి ఆధ్వర్యంలో అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, భేరి పూజా, దేవతాహ్వానం, బలిహరణ తదితర పూజలు నిర్వహించారు. గరుడవాహనంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆలయ ఆరుబయట ఎదుర్కోళ్లను నిర్వహించారు. మండలంలోని అంబట్‌పల్లిలో ఉత్సవాలలో భాగంగా ఎదుర్కోళ్లు కనులపండువగా కొనసాగింది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పూజారీ భాస్కర్, మహిళా అధ్యక్షురాలు చిత్తూరు ఇందిరమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి మండలంలోని గంగారం రామాలయం, వట్టెం వేంకటేశ్వరస్వామి దేవాలయం, పాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో పాటు తిమ్మాజీపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో శ్రీరామ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పందిళ్లు, తోరణాలు, పూలతో ఆలంకరించారు.

రాములోరికి పట్టు వస్త్రాలు



● అపర భద్రాద్రిగా విరాజిల్లుతున్న సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం సందర్భంగా మంగళవారం కల్వకుర్తి సగర సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలను తీసుకెళ్తనట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని భగీరథ ఆలయం వద్ద సగర సంఘం నాయకులు కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో సగరసంఘం నాయకులు వివేకానంద, రాజుసాగర్, దుర్గయ్యసాగర్, రాములుసాగర్, చిరంజీవి, భీమయ్యతోపాటు సగరసంఘం సభ్యులు ఉన్నారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: మండల కేంద్రంలోని కేఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 18న పార్లమెంట్ ఎన్నిల సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం సమావేశ ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీటీసీ విజితారెడ్డి, నాయకులు నిరంజన్, యాదగిరి, భాస్కర్‌రావు, నర్సింహ్మముదిరాజ్, నిరంజన్, విజయ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు



అచ్చంపేట రూరల్: నోటుకు ఓటు అమ్ముకోవద్దని జైహో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వర్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన వాల్ పోస్టర్‌ను విడుదలన చేశారు. డబ్బుకి, మద్యానికి ఓటు అమ్ముకుంటే బతికున్నా.. శవంతో సమానం అని పేర్కొన్నారు. దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నాయకులు జై భారత్ రాష్ట్ర కార్యదర్శి రాజు, కాశీం, మహేష్, విజయ్, శంకర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం



ఉప్పునుంతలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకొని సత్తా చాటుదామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల హామీలుగా అమలు చేశామన్నారు. నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి ఎంపీ అభ్యర్థిగా మల్లురవి గెలుపు కోసం కృషిచేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు తిప్పర్తి నర్సింహ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ్మారావు, లక్ష్మీనారాయణ, నారాయణ్‌రెడ్డి, నిరంజన్, మల్లయ్య, మల్లారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేదారేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

స్థానిక కేదారేశ్వరాలయం అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆలయాన్ని సందర్శించిన నూతనం తయారు చేసిన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణంలో భాగంగా నిర్వహించిన ఎదుర్కొళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.


దళిత పొలిటికల్ జేఏసీ ఏర్పాటు



మాట్లాడుతున్న జైశంకర్

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు దళిత పొలిటికల్ జేఏసీగా ఏర్పాటు అయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా వంగూరు జైశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా అవుట శ్రీనివాసులు, కో కన్వీనర్‌గా చింతరవి, లక్కిరాజు, చెట్టి కిశోర్‌కుమార్, ములకలపల్లి వెంకటయ్య తదితరులు ఎన్నికయ్యారు. బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ అరవిందుచారి, బహుజనముక్తి పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గద్దం విజయ్‌లు వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు.

తప్పుల తడకగా సమాచార పత్రం



వంగూరు: ఈ నెల 20 నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి సంబంధించి సర్క్యులర్ తప్పుల తడకగా రూపొందించారు. 20-4-2024 తేదీకి బదులు 20-4-2021 తేదీన పొందుపర్చారు. అదేవిధంగా ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై నప్పటికీ సర్క్యులర్‌లో మాత్రం ఎమ్మెల్సీగా రాయడం గమనార్హం. తప్పుల తడకగా సర్క్యులర్ తయారుపై పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

తాడూరు: రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతారంలో బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు అందరూ ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్న రాములు, కార్యదర్శి ఉమాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు అరుణమ్మ, శారద, గ్రామస్తులు రవీందర్, మధుసూదన్‌రావు, యాదయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

పెద్దకొత్తపల్లి: మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు 25 గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేసవికాలం కావడంతో ఉపాధి పనులకు 2343 మంది కూలీలు పనికి వస్తున్నారని ఏపీఓ మంజుల తెలిపారు.

బిజినేపల్లి: వేసవికాలంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణాజీ అన్నారు. మంగళవారం మండలంలోని గుడ్లనర్వ, లింగసానిపల్లి, వసంతాపూర్ గ్రామాల్లోని ఉపాధి కూలీలు పని చేసే ప్రాంతంలో సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

చారకొండ: వేసవిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి కూలీలు చేస్తున్న పని ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. పనులకు పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గణేష్ తదితరులు ఉన్నారు.



పెద్దకొత్తపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

మన్ననూర్: శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన రెండేళ్ల చిన్నారితో పాటూ నలుగురు వ్యక్తులు కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామం సమీపంలో ముందు టైర్ పగిలింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో రాజ్‌కుమార్, క్రాంతి, పరమేశ్వర్‌రావ్, అన్నపూర్ణలకు కాళ్లు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చిన్నారికి క్షేమంగా బయటపడ్డది. బాధితులను అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈగలపెంట ఎస్సై వీరమల్లు తెలిపారు.

కేసు నమోదు

అచ్చంపేట రూరల్: మండలంలోని కొర్రతండాకు చెందిన కొర్ర రాంలాల్ ఇంటి చుట్టు దాయాదులు ఇనుప కంచె వేశారు. ఈ విషయంపై సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొర్రతండాకు చెందిన రాంలాల్ వ్యవసాయ పొలంలో ఇంటిని నిర్మించుకున్నాడు. అదే తండాకు చెందిన దాయాదులు కొర్ర లచ్చ, హున్య, విజయ్, కిషన్‌లు మంగళవారం రాంలాల్ ఇంటికి తాళం వేసి షెటర్, ద్వారాల వద్ద ఇనుప కంచె వేశారు. రాంలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో..

లింగాల: తాగి వాహనం నడిపి పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన తెలకపల్లి మండలం పెద్దూరుకు చెందిన సిద్దార్థరెడ్డికి కోర్టు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ టెక్నాలజి సొసైటీ ఆధ్వర్యంలో బీసీ నిరుద్యోగ యువత కోసం ఓరియెంటెడ్ ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గోవిందు, శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మిషన్ ఆపరేటర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మండల అధ్యక్షుడిగా చాకలి నర్సింహ



కొల్లాపూర్: తెలంగాణ జానపద కళాకారుల సంఘం మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన చాకలి నర్సింహ నియమితులయ్యారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, గౌరవ అధ్యక్షుడు రాములు, కళాకారులు రమాదేవి సమక్షంలో నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా మొట్టె నర్సింహ, అవుట స్వామి, కర్నె నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా బిజ్జ వేణు, సహాయ కార్యదర్శులుగా గుగ్గిల రమేష్, మద్దెల రామచంద్రం, కోశాధికారిగా కలమంద చెన్నయ్య, ప్రచార కార్యదర్శులుగా పూజారి కృష్ణయ్య, నార్లాపూర్ సత్యనారాయణ, కలమంద నర్సింహ, సలహాదారులుగా బండి ఆనంద్, మన్నె శివకుమార్‌లు నియమితులయ్యారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

కల్వకుర్తిరూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నరేట్ల శేఖర్‌రెడ్డిలు కోరారు. మంగళవారం పట్టణంలో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా పట్టణంలో వివిధ కాలనీలలో వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. నర్సింహ, బాబిదేవ్, రాంరెడ్డి, వివేకానంద, గంగాధరాచారి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో బీజేపీ మండల కార్యవర్గ సభ్యుడు వెంకటనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా భరత్‌ప్రసాద్ ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు సుల్తాన్, రవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని ఎంజీతండాలో కల్వకుర్తి నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని మోదీకి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దయ్య, రమేష్‌నాయక్, శివ, సాయి, బద్రునాయక్ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, వెంకటేశ్వర్లబావి, కుమ్మరోనిపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మాట్లాడుతూ దేశంలో సుస్థిర పాలన దేశ ప్రధాని నరేంద్ర మోదీకే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు వెలిజాల శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి రామోజీ, అమ్రాబాద్ మండల అధ్యక్షుడు గోలి రాజు, మల్లేష్, ప్రసాద్, బాలకృష్ణ, శాంతికుమార్, వాల్యా తదితరులు పాల్గొన్నారు.

మల్లురవిని అధిక మెజార్టీతో గెలిపించాలి

అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని అధిక మెజార్టీతో గెలిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాము కోరారు. మంగళవారం పట్టణంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్, హరీష్, దశరథం, రాము, శివ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలి

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ రూపొందించిన అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలుచేయాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవనికుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కో యూనిట్ ద్వారా రూ.12 లక్షలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశంలో బాలకృష్ణ, శీలం వెంకటేష్‌లు ఉన్నారు.

చెక్కు అందజేత



లింగాల: పెద్దకొత్తపల్లి మండలం ఆదిరాలకు చెందిన వెంకటస్వామిని గత ఏడాది ఏప్రిల్ నెలలో లింగాల అటవీ శాఖ రేంజ్ పరిధిలో అడవి పంది దాడి చేసి చంపింది. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్వో వీరేషం రూ. 5 లక్షల నష్టపరిహారం చెక్కును మృతుడి భార్య అలివేలకు అందజేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన చెంచు మహిళ అఖిల అంబులెన్సులో ప్రసవం అయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సోమవారం రాత్రి మహిళకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఎర్రపెంట నుంచి మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి వచ్చిన మహిళను పరీక్షించిన వైద్యులు రక్తం లెవన్స్ తక్కువ ఉందని, నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. మార్గమధ్యలో రాంరెడ్డిపల్లి దగ్గర మహిళకు పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది లక్ష్మణ్, కిశోర్ తెలిపారు.

ఓటింగ్ శాతం పెంచాలి

కొల్లాపూర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని మెప్మా పరధిలోని మహిళా సంఘాల నాయకురాలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. మెప్మా సిబ్బంది ఉన్నారు.

సారా స్వాధీనం

బల్మూర్: మండలంలోని కొండనాగుల తండాకు చెందిన రమావత్ హన్మంత్ నుంచి మంగళవారం నాలుగు లీటర్ల సారాను స్వాధీన చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. కొండనాగుల నుంచి బాణాల రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై సారా తరలిస్తూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది ఆంజనేయులు, నవీన్, పరమేష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు సమయస్ఫూర్తి ముఖ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని నాగర్‌కర్నూల్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కృష్ణమూర్తి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్‌హాల్స్, ప్రైవేటు ఆస్పత్రులు, స్కూల్స్, సినిమా థియేటర్లతో పాటు రద్దీ ప్రాంతాల్లో దుకాణదారులు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ కలిగి ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించి, మంటలను అదుపులోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది